

కొకైన్ స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): దేవనహళ్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. సుమారు రూ. 80లక్షల విలువైన 850 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీరి నుంచి రెండు మొబైల్ ఫోన్లు, ఒక ఎలక్ట్రానిక్ తూకపు యం త్రం, ప్యాకింగ్ కవర్లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కోర్టులో హాజరు పరచగా మ రింత దర్యాప్తుకోసం ఏడు రోజుల పోలీసు కస్టడీకి అప్పగించారు. ఈశాన్య విభాగం డీసీపీ లక్ష్మీప్రసాద్, దేవనహళ్లి ఏసీపీ నవీన్‌కుమార్ నేతృత్వంలో కార్యాచరణ చేపట్టారు. దర్యాప్తు సాగుతోందని పోలీసులు శుక్రవారం వెల్లడించారు.

ఎన్నికల వేళ..హెలికాప్టర్లకు

భలే డిమాండ్



- ముఖ్యనేతలు, స్టార్ క్యాంపెయినర్ల కోసం ఏర్పాటు
- జోరందుకున్న తొలి విడత ప్రచారం
- మలి విడత నామినేషన్లకూ వెళ్లనున్న కీలక నేతలు



ప్రచారానికి సిద్ధంగా ఉన్న హెలికాప్టర్లు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల వేడి పుంజుకుంది. ఈ నేపథ్యంలో ముఖ్యనేతలకు విస్తృతంగా పర్యటించాల్సి ఉంటుంది. వారి కోసం ప్రత్యేక హెలికాప్టర్లు అవసరమవుతాయి. దీంతో ఒక్కసారిగా హెలికాప్టర్లకు డిమాండ్ పెరిగిపోయింది. 28 నియోజకవర్గాలకు సంబంధించి రెండు విడతలుగా పోలింగ్ జరగనుంది. బెంగళూరు, మైసూరు, తీరప్రాంత జిల్లాలకు అనుబంధమైన 14 నియోజకవర్గాల్లో నామినేషన్ల ఘట్టం ముగిసింది. ప్రచార హోరు ప్రారంభమైంది. మరోవైపు రెండో విడత జరిగే పోలింగ్‌కు త్వరలోనే నామినేషన్లు ప్రారంభం కానున్నాయి. ఇలా ప్రతి చోటా కీలక నేతలు పర్యటించనున్నారు. భారీ బహిరంగసభలు, రోడ్‌షోల ద్వారా ప్రముఖనేతలు పాల్గొంటే కొత్త ఉత్సాహం వస్తుందని అభ్యర్థులు భావిస్తున్నారు. అందుకే బీజేపీ-జేడీఎస్, కాంగ్రెస్ కీలక నేతలు స్టార్ క్యాంపైనర్లకు బిజీ షెడ్యూల్ నిర్ణయించారు. కాంగ్రెస్ నుంచి సీఎం సిద్దరామయ్య, డీసీఎం డీకే శివకుమార్‌తోపాటు జాతీయనేతలు, బీజేపీ నుంచి యడియూరప్ప, విజయేంద్ర, ఆర్ అశోక్‌లతోపాటు పలువురు పర్యటించనున్నారు. జేడీఎస్ నుంచి కుమారస్వామి, దేవెగౌడ, నిఖిల్ కుమారస్వామి సహా పలువురు షెడ్యూల్ ఖరారయ్యాయి. ఇక బీజేపీ నుంచి కేంద్రమంత్రులు, అగ్రనేతలు రాష్ట్రంలో సుడిగాలిలా తిరిగేందుకు సిద్ధమయ్యారు. కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్, జైశంకర్, స్మృతి ఇరాణీ, అనురాగ్‌సింగ్ ఠాకూర్‌తోపాటు గోవా సీఎం సహా పలువురు పర్యటిస్తున్నారు. ఇలా రాష్ట్రంలో ప్రచార హోరు పెరగడంతో హెలికాప్టర్లకు డిమాండ్ పెరిగింది. ఎన్నికల వేళ అన్ని ఏవియేషన్ కంపెనీలు సుమారు 15శాతం చార్జీలను పెంచేశాయి. ఇప్పటికే ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ నాయకులు తమ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. స్థానిక ప్రాంతాల్లో రోడ్‌షోలు కొనసాగిస్తుండగా ఒకే రోజు నాలుగైదు శాసనసభ నియోజకవర్గాల్లో పర్యటించేందుకు వీలుగా హెలికాప్టర్లను వినియోగిస్తున్నారు. వీవీఐపీల కోసం మినీ విమానాలు కూడా సిద్ధంగా ఉన్నాయి. రాష్ట్రంలో ప్రధాన పార్టీలన్నీ తమ స్టార్ క్యాంపైనర్లను ఇప్పటికే ప్రకటించిన సంగతి విదితమే. వీరి డిమాండ్‌కు అనుగుణంగా సుమారు 120కు పైగా హెలికాప్టర్లు, మినీ విమానాలు బుక్ చేసుకున్నట్టు సమాచారం. దీంతో గతంతో పోలిస్తే బాడుగ ధర కూడా 15 శాతం పెరిగినట్టు తెలుస్తోంది. స్టార్ ప్రచారకుల క్యాంపైయిన్‌లో వారి సురక్షత కోసం నిర్వహణ రీత్యా డబుల్ ఇంజన్ సామర్థ్యం కల్గిన హెలికాప్టర్, వీఐపీ పైలట్లను ఇతర ప్రాంతాల నుంచి రప్పిస్తున్నట్టు సేవా ఆపరేటర్ల ద్వారా తెలుస్తోంది. తాజాగా సీఎం సిద్ధరామయ్య రెండు రోజుల క్రితం చిక్కబళ్లాపుర జిల్లా పర్యటనలో హెలికాప్టర్ వినియోగించారు. ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమం, వక్ఫ్‌బోర్డు శాఖల మంత్రి జమీర్ అహ్మద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. బెంగళూరు నగరంలో జక్కూరు ఏరోడ్రమ్, హెచ్ఏఎల్, వైట్‌ఫీల్డ్ ప్రాంతాల్లో హెలికాప్టర్లను అందుబాటులో వివిధ సంస్థలు సిద్ధం చేశాయి. సమయం తక్కువగా ఉన్న తరుణంలో ఒక్కో క్షణం కూడా అమూల్యమైనదిగా పరిగణిస్తారు. వీవీఐపీల పర్యటనలన్నీ మినిట్ టు మినిట్ ప్రోగ్రామ్‌గా రూపొందిస్తారు. సమయాన్ని ఖచ్చితంగా పాటించాలంటే అందుకు తగిన రవాణా తప్పనిసరి. ఇందుకు అవసరమైన ప్రాంతాలను సకాలంలో చేరుకోవాలంటే మినీ విమానం, హెలికాప్టర్లు వంటివివాడడం సాధారణం. కొంతమంది నాయకులు సొంతంగా హెలికాప్టర్, చార్టెర్డ్ విమానాలు కలిగి ఉన్నా వాటిని కూడా ఎన్నికల కోసమే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు.

రకం (సింగిల్ ఇంజన్)	గంటకు బాడుగ లక్షల్లో
2 సీటర్ హెలికాప్టర్	రూ.2.10
4 సీటర్ హెలికాప్టర్	రూ.2.30
6 సీటర్ మినీ విమానం	రూ.2.60
8 సీటర్ మినీ విమానం	రూ.3.50
13 సీటర్ల మినీ విమానం	రూ.4.00



గంట బాడుగ కనీసం రూ.2 లక్షల పైమాటే

హెలికాప్టర్ల బాడుగ ధర కూడా అధికంగానే ఉంది. గంటకు కనీసం రూ.2.10 లక్షలుగా నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఇది కూడా జీఎస్టీ చేరి. ఇక 4 సీటర్ హెలికాప్టర్ అయితే రూ.2.30 లక్షలుగాను, 6 సీటర్ మినీ విమానానికి రూ.2.60లక్షలుగాను, 8 సీటర్ విమానానికి రూ.3.50లక్షలుగాను, 13 సీటర్ విమానానికి రూ.4లక్షలుగాను ఉన్నట్టు తెలుస్తోంది. ఇక డబుల్ ఇంజన్ హెలికాప్టర్లు, విమానాల ధర అయితే మరింత అధికమని ఎయిర్ అంబులెన్స్ డైరెక్టర్ డాక్టర్ శమిత్ తెలిపారు.



విధానసౌధ వద్ద బాబూ జగ్జీవన్‌రామ్‌కి సీఎం సిద్ధరామయ్య నివాళులు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం విధానసౌధలో ఆయన విగ్రహానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఉపప్రధానిగా బాబూజీ చేసిన సేవలు నిరుపమానమని కొనియాడారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ కేబినెట్‌లో అతి పిన్న వయస్కుడైన మంత్రులలో ఒకరని, కేంద్ర కార్మికశాఖ మంత్రిగా వ్యవహరించడమే కాక రాజ్యాంగ నిర్మాణానికి ఏర్పాటైన కమిషన్‌లోనూ సభ్యుడిగా కొనసాగారన్నారు. ఇండో-పాకిస్థాన్ యుద్ధ సమయంలో రక్షణశాఖ మంత్రిగా వ్యవహరించారని తెలిపారు. ప్రత్యేకించి వ్యవసాయశాఖ మంత్రిగా హరిత విప్లవం సృష్టించారని, బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. మూడు దశాబ్దాలకుపైగా నిరంతరాయంగా పార్లమెంటు సభ్యుడిగా వ్యవహరించి రికార్డు నెలకొల్పారన్నారు. ఈ సందర్భంగా సాంఘిక సంక్షేమశాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప, ఎమ్మెల్యే ఈ తుకారామ్, మాజీ మంత్రి ఆంజనేయ, ఎమ్మెల్సీ సుధామదాస్, మహిళా కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. కేపీసీసీ కార్యాలంలోనూ బాబు జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కేపీసీసీ అధ్యక్షుడు, డీసీఎం డీకే శివకుమార్ సహా పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అయోమయంలో ఈశ్వరప్ప

- అమిత్‌షా పిలుపుతో ఢిల్లీకి
- అపాయింట్‌మెంట్ దొరక్క వెనక్కి..

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సీనియర్ నేత ఈశ్వరప్ప పరిస్థితి అయోమయంలో పడినట్టయింది. కుమారుడికి హావేరి టిక్కెట్ దొరకలేదని శివమొగ్గ నుంచి తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని ప్రకటించారు. ఎవరు ఒత్తిడి తెచ్చినా చివరకు బ్రహ్మ వచ్చినా వెనుకడుగు వేసేదిలేదని, నామినేషన్ వేసి తీరుతానని తెలిపారు. ఈలోగానే రాష్ట్ర పర్యటనకు వచ్చిన పార్టీ కీలక నేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఫోన్‌లో ఈశ్వరప్పతో మాట్లాడారు. ఢిల్లీ రావాలని సూచించారు. ఆయన పిలుపు అంశాన్ని మీడియాకు వివరించారు. పోటీ విషయంలో వెనుకడుగు లేదని, అగ్రనేత ఆహ్వానం మేరకు ఢిల్లీ వెళ్తున్నానని తెలిపారు. అమిత్‌షా ఫోన్ చేసిన తర్వాత కూడా ఈశ్వరప్ప ఘాటుగా మాట్లాడడంపై ఇంటెలిజెన్స్ వర్గాల నుంచి సమాచారం చేరింది. గురువారం ఢిల్లీ వెళ్లిన ఈశ్వరప్పకు అమిత్‌షా అపాయింట్‌మెంట్ లభించలేదు. షా కార్యాలయం నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో ఆయన వెను తిరిగారు. పోటీ చేయాలని పరోక్షంగా సూచించారని ఈశ్వరప్ప చెప్పుకున్నారు. అమిత్‌షా పిలుపు రాగానే చలో ఢిల్లీ అంటూ వెళ్లిన ఈశ్వరప్పకు కనీసం పలకరించకుండానే వాపసు పంపడాన్ని బట్టి సుముఖత వ్యక్తం చేయడం లేదని తెలుస్తోంది. ఈశ్వరప్ప ఒకవేళ నామినేషన్ దాఖలు చేసినా చివరి క్షణంలో అగ్రనేతలు పిలిస్తే వెనుకడుగు వేస్తారని, ఎలా ముందుకెళ్లాలని కార్యకర్తలు వాపోతున్నారు.



సుమలతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న యడియూరప్ప, విజయేంద్ర తదితరులు

మోదీని మళ్లీ ప్రధానిని

చేయడమే లక్ష్యం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర
- బీజేపీలో చేరిన సుమలత

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): నరేంద్రమోదీని మరోసారి ప్రధానమంత్రిని చేయడమే తమ లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొన్నారు. బెంగళూరు బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజలంతా మోదీని ఆదరిస్తున్నారని, ఆయనను మళ్లీ ప్రధాని చేసేందుకు 400 సీట్ల లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా మండ్య ఎంపీ సుమలతాఅంబరీశ్‌తోపాటు కొప్పళ మాజీ ఎంపీ ఎస్. శివరామేగౌడ, విజయపుర జిల్లా యువనాయకుడు, మంత్రి శివనాంద పాటిల్ కుటుంబానికి చెందిన హర్షగౌడ శివశరణ పాటిల్, మాజీ క్రికెటర్ దొడ్డగణేశ్, గాయత్రి తిమ్మారెడ్డి, ఉత్తరకన్నడ జిల్లా హళియాళకు చెందిన శ్రీనివాస్, తుకారాంగౌడ పాటిల్ తదితరులు బీజేపీలో చేరారు. వీరందరికీ పార్టీ జెండా అందచేసి స్వాగతించారు. సుమలత మాట్లాడుతూ బీజేపీ నాయకులు మార్గదర్శకం లభించిందని అందుకు వారికి ధన్యవాదాలన్నారు. ప్రధాని మోదీ నాయకత్వం, పరికల్పన, సంకల్పం స్ఫూర్తి దాయకమన్నారు. మండ్య జిల్లా సమస్యల పరిష్కారానికి తనవంతు నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. మై షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభమైందని, ఇందుకు ప్రజలు అభివృద్ధిని చూసి బీజేపీకి మద్దతు ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ రాధామోహన్‌దాస్ అగర్వాల్, ప్రతిపక్షనేత అశోక్, మాజీ సీఎం డీవీ సదానందగౌడ, బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీటీ రవి, మాజీ డీసీఎం డాక్టర్ సీఎన్ అశ్వత్థనారాయణ, మాజీ మంత్రి మునిరత్న, ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి, మాజీ మంత్రి నారాయణగౌడ, బీజేపీ మండ్య జిల్లా అధ్యక్షుడు ఇంద్రేశ్‌కుమార్, కొప్పళ జిల్లా అధ్యక్షుడు నవీన్ గుళగణ్ణవర్, ప్రభురాజ ఎస్ పాటిల్, గంగావతి తాలూకా పంచాయతీ అధ్యక్షుడు వీరభద్రగౌడ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సీఎం సిద్దరామయ్య

రాష్ట్ర ద్రోహి మోదీకి

గుణపాఠం చెప్పండి

- అబద్ధాలతో నెట్టుకొస్తున్న బీజేపీ
- చిత్రదుర్గలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలో పాలిస్తున్న బీజేపీ ప్రభుత్వం కర్ణాటక రాష్ట్రానికి నిరంతరంగా ద్రోహం చేస్తూ వస్తోందని, లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి తగిన గుణపాఠం చెప్పాలని ముఖ్యమంత్రి సిద్దరామయ్య పిలుపునిచ్చారు. చిత్రదుర్గలో శుక్రవారం ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ఏళ్ల తరబడి రాష్ట్రానికి పలు విషయాలలో అన్యాయం చేస్తోందని విమర్శించారు. నాలుగేళ్లక్రితం వరదల వేళ స్పందించలేదని, ప్రస్తుతం కరువుతో రాష్ట్రం అతలాకుతలమవుతున్నా ప్రధాని మోదీ గ్రాంట్లు విడుదల చేయలేదని తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, గ్రాంట్లలో ఒక్కరూపాయి కూడా విడుదల చేయలేదని అన్నారు. భద్ర ఎగువ ప్రాజెక్టుకు రూ.5,300 కోట్లను కేటాయిస్తూ 2023 బడ్జెట్‌లో ప్రకటించారని, ఏడాది తర్వాత మరో బడ్జెట్ ముగిసినా ఒక్కపైసా కూడా విడుదల చేయలేదని వివరించారు. ఆర్ఎస్ఎస్‌లో బీజేపీ నాయకులకు అబద్ధాలపై శిక్షణ ఇస్తారని అన్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా భయంకరమైన అబద్ధాలు చెప్పే వ్యక్తి అన్నారు. అబద్ధాలు ప్రచారం చేస్తూనే దేశం తిరిగేస్తున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో పర్యటిస్తూ కరువు గ్రాంట్ల గురించి మాట్లాడలేదన్నారు. కరువు సాయానికి సాకులు చెప్పారన్నారు. రాష్ట్రప్రభుత్వం మూడు నెలల ఆలస్యంగా కరువు సమస్య విన్నవించిందని చెప్పేందుకు సిగ్గుండాలని మండిపడ్డారు. ఆరునెలల క్రితమే కేంద్రానికి లేఖ పంపామని, ఇలాంటి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటన్నారు.



ఆర్.శంకర్‌ను స్వాగతిస్తున్న డీకే శివకుమార్

రాజకీయాల్లో

ఎంతకాలం ఉంటానో..!

- ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ వైరాగ్యం


బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాజకీయాల్లో ఎంతకాలం ఉంటానో తెలియదని డీసీఎం డీకే శివకుమార్ వైరాగ్యంతో మాట్లాడడం సర్వత్రా చర్చనీయాంశమైంది. శుక్రవారం కేపీసీసీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ ఎంతకాలం రాజకీయాల్లో ఉంటానో తెలియదుగానీ అంతవరకు మీరు పార్టీ ప్రగతికోసం సహకరించాలన్నారు. కొత్త కార్యాధ్యక్షులు విజిటింగ్ కార్డుతో తిరిగితే పనులు సాగవన్నారు. కష్టపడి పనిచేయాలని, ఎన్నికల్లో మీ ప్రాంతాల్లో ప్రాబల్యం చూపాలన్నారు. ఎన్నికల తర్వాత మీ పనితీరును పరిశీలిస్తానన్నారు. మీ సొంతకార్లలో తిరగాలని సూచించారు. కాగా రాణిబెన్నూరుకు చెందిన మాజీ మంత్రి ఆర్ శంకర్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బెంగళూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని రాజరాజేశ్వరినగర్‌లో డీకే శివకుమార్ భార్య ఉషా ఇంటింట ప్రచారం చేశారు.



ఇఫ్తార్	: శనివారం సాయంత్రం 6:33
సెహరి	: ఆదివారం ఉదయం 04:57

గడినాడులో విజయం ఎవరికో?


- 1951 నుండి 1999 వరకూ కాంగ్రెస్‌దే హవా
- 2004 నుండి 2018 వరకూ కమలానిదే గెలుపు



బళ్లారి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): గడినాడు ప్రాంతంలో భాగమైన బళ్లారి రాజకీయం ఆసక్తికరంగా ఉంటుంది. ఇక్కడ ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీల మధ్య పోరు హోరాహోరీగా సాగుతోంది. గత చరిత్రను పరిశీలిస్తే స్వాతంత్రం వచ్చిన తరువాత జరిగిన ఎన్నికల్లో 1951 నుండి 1999 వరకూ బళ్లారి కోటపై కాంగ్రెస్ జెండానే రెపరెపలాడుతూ వచ్చింది. 1999లో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ, కమలం నుంచి సుష్మస్వరాజ్ పరస్పరం తలపడింది ఇక్కడినుంచే. తరువాత సోనియా ఈ స్థానానికి రాజీనామా చేసి అమేథీ స్థానాన్ని నిలుపుకున్నారు. 1971లో జగజ్జీవన్‌రాంకు చెందిన నాయకులు కూడా ఇక్కడ నుంచే పోటీ చేశారు.

2004లో గాలి జనార్దన్‌రెడ్డి సోదరుడు గాలి కరుణాకర్ రెడ్డి ఎంపీగా గెలిచి బీజేపీకి బోణీ కొట్టారు. 2008లో బళ్లారి ఎంపీ స్థానం ఎస్టీలకు రిజర్వు అయింది. 2014 ఎన్నికల్లో బీజేపీ నుంచి శ్రీరాములు, కాంగ్రెస్ నుండి వాల్మీకీలకు గురువుగా భావించే సుప్రీం కోర్టు విశ్రాంతి న్యాయమూర్తి ఎన్.వై హనుమంతప్ప పోటీ పడగా అప్పుడు కేవలం రెండువేల పై చిలుకు ఓట్లుతో బీజేపీ అభ్యర్థి శ్రీరాములు విజయం సాధించాడు. 2018లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఉగ్రప్ప గెలుపొందారు. 2019లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి ప్రస్తుత ఎంపీ దేవేంద్రప్ప గెలిచారు. బళ్లారి జిల్లాలో కాంగ్రెస్, బీజేపీతో పాటు జేడీఎస్ కూడా బలంగా ఉండేది. కానీ ఈ మధ్యకాలంలో జేడీఎస్ పార్టీ నాయకులు చేస్తున్న తప్పులకు పార్టీ ఈప్రాంతంలో పలచబడిపోయింది. ఏదో నామ్‌కే వాస్తేగా ఉంది. ప్రస్తుతం పోటీ కాంగ్రెస్, బీజేపీ మధ్యే సాగుతోంది. కాంగ్రెస్ తరపున తుకారాం, బీజేపీ తరపున శ్రీరాములు పోటాపోటీగా ప్రచారం చేసుకుంటున్నారు. 2024లో జరుగుతున్న ఈ ఎన్నికల్లో జనం ఎవరికి పట్టం కడతారో వేచిచూడాల్సిందే.

తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు



	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1,579.82	1,581.99
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	881	6,022
సామర్థ్యం (టీఎంసీలు)	4.38	5.51

ఘనంగా బాబూ జగ్జీవన్ రామ్ జయంతి



జగ్జీవన్‌రామ్‌కు నివాళులర్పిస్తున్న డీసీ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, ఏప్రిల్ 5: మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతి సందర్భంగా ఆయనకు కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశం హరిత విప్లవానికి మార్గదర్శకుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని తెలిపారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సరళంగా ఆయన జయంతిని నిర్వహించినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లాపంచాయితీ ముఖ్య కార్యనిర్వహణాధికారి రాహుల్ శరణప్ప, జిల్లా ఉపకలెక్టర్ మహ్మద్ జుబేరా, అదనపు పోలీసు సూపరింటెండెంట్ నవీన్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు సతీశ్, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కంప్లిలో...



కంప్లిలో జగ్జీవన్ రామ్‌కు అధికారుల నివాళి

కంప్లి, ఏప్రిల్ 5 : కంప్లి, కురుగోడులో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. కంప్లి తాలుకా కార్యాలయంలో ఆయన భావ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ప్రతి ఒక్కరు ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకెళ్లాలనిసూచించారు. ఈ కార్యక్రమంలో రామన్న, దేవేంద్ర, వెంకటరమణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

రూ. 2.51 లక్షలు పలికిన పూజాసామగ్రి అంగడి

కంప్లి , ఏప్రిల్ 5 : బుక్కసాగర వద్ద వుండే ఏళుపడగల నాగప్ప దేవస్థాన పూజాసామాగ్రి దుకాణం వేలంపాట రూ. 2.51 లక్షలు పలికింది. ఈ వేలంలో నలుగురు పోటీపడగా చివరకు నాగరాజు అనేవ్యక్తి దానిని దక్కించుకున్నట్లు దేవాదాయ శాఖ అధికారి హనుమంతప్ప తెలిపారు. ఏప్రిల్ 24 నుంచి ఏప్రిల్ 25 వరకు ఒక సంవత్సరం గడువుకు ఈ వేలంపాట జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ అధ్యక్షులు హనుమప్ప, క్రిష్ణప్ప, రుద్రప్ప, ఉలిగప్ప, తిమ్మప్ప, అమ్మాజీ మంజునాథ, దేవాదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సరిహద్దు చెక్‌పోస్టుల తనిఖీ

బళ్లారిరూరల్, ఏప్రిల్ 5 : తాలుకాలోని ఆంధ్ర, కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కారేకల్, బొమ్మనహాళ్‌తో పాటు సరిహద్దు ప్రాంతాల్లో పలు చెక్‌పోస్టులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఇరు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో కర్ణాటక రాష్ట్రానికి వచ్చే వాహనాలు, కర్ణాటక నుండి ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలని చెక్‌పోస్టులో ఉన్న అధికారులకు కలెక్టర్ తెలిపారు. అక్రమ మద్యం, అక్రమ నగదు తరలింపు తదితర అంశాలపై అధికారులు ప్రధానంగా దృష్టి పెట్టాలన్నారు.

కొప్పాళ కాంగ్రెస్ అభ్యర్థి దర్గా సందర్శన



దర్గాను సందర్శిస్తున్న కొప్పాళ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి

సిరుగుప్ప, ఏప్రిల్ 5 : కొప్పాళ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రాజశేఖర్ ఇత్నాల్ ఖాదర్‌షా వలీ దర్గాను సందర్శించి తాత ఆశీర్వాదాలు పొందారు. సిరుగుప్ప పట్టణంలో శుక్రవారం దర్గాను సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రధాని అయితే మహిళలకు రూ. లక్ష ఖాతాలో జమ చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఐదు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కోటిరెడ్డి, హుస్సేన్‌సాబ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూరిగుడిసెలో పురసభ సభ్యురాలు

ప్రజా ప్రతినిధిగా ఉన్నా తప్పని పేదరికం

బళ్ళారి గాంధీనగర్, ఏప్రిల్ 5: గ్రామాలు అభివృద్ధి చెందినపుడే దేశాభివృద్ధి సాధ్యమని నేతలు ఏకరువు పెడుతుంటారు. దేశాభివృద్ధి మాట ఎలా ఉన్నా... గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఓ మహిళా గ్రామ పంచాయతీ సభ్యురాలు ఇతరుల స్థలంలో పూరిగుడిసెలో దిక్కులేని జీవనం గడుపుతుండడం గ్రామ ప్రజలను కలిచి వేస్తోంది. తమకేదో చేస్తుందని గెలిపిస్తే... ఆమెకే దిక్కులేకుండా పోయిందని తోటిసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



తన గుడిసె బయట నిలబడిన సింధగి పురసభ సభ్యురాలు మహాదేవి

విజయపుర జిల్లా పరిధిలోని సింధగి గ్రామ పంచాయతీ 23 వార్డు పురసభకు కాంగ్రెస్ పార్టీ తరపున సభ్యురాలుగా మహాదేవి భీమశ్యానాయ్కోడి గెలుపొందింది. గెలుపుకు కృషి చేసిన ఆమె కుమారుడు మహాంతేష్ మహారాష్ట్రకు కూలీపనులకు వలస వెళ్ళాడు. విజయపుర జిల్లా, సింధగి పురసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ మహిళకు ప్రత్యేకించి ఏ వృత్తిలేకపోవడంతో నిత్యం కూలి పనికి వెళుతుంది. లేకపోతే గుడిలో పెట్టే నైవేద్యమే దిక్కు. వృద్ధాప్య పింఛను కూడా లేదు. పురసభ ఆశ్రయ పథకం క్రింద ఇల్లులేని వారి జాబితాలో ఆమెకు ఒక ఇంటి స్థలం కూడా కేటాయించక పోవడం గమనార్హం. పురసభ సామాన్య సభకు హాజరైనపుడు అందే గౌరవ వేతనం కూడా సరిగా అందడంలేదు. ఆమె గుడిసె ఓ ప్రైవేట్ లే ఔట్‌లో ఏర్పాటు చేసుకోవడంతో వారు స్థలాన్ని ఖాళీ చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేస్తోంది... దేశానికి గ్రామాలే వెన్నెముకగా చెప్పుకొస్తున్న నేతలు... స్థానిక సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న నిరుపేద ప్రజా ప్రతినిధులను గుర్తించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఎన్నికల బహిష్కరణకు గ్రామస్థుల నిర్ణయం

గంగావతి రూరల్, ఏప్రిల్ 5: ఏడు దశాబ్దాలుగా ఇళ్ళుపట్టాలు ఇవ్వకుండా ఇటు అధికారులు, స్థానిక ప్రజా ప్రజా ప్రతినిధులు ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఆనెగొంది సమీపంలోని ఐదు గ్రామాల ప్రజలు లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించారు. ఆనెగొంది పరిధిలోని సణాపుర, మల్లాపుర, సంగాపుర తదితర గ్రామాల్లో నివసిస్తున్న ఎంతో మంది నిరుపేద కుటుంబాలు నేటికీ ఇళ్ళులేక తాత్కాలిక ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో నివసిస్తున్నారు. పక్కా ఇళ్ల మంజూరు కావాలంటే ఇళ్ల పట్టాలు ఉండాలంటారు అధికారులు. వాళ్లేమో పట్టాలివ్వరు. ఇదీవారి పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ ఆ గ్రామాలవారందరూ శుక్రవారం గంగావతి తాహసీల్దారుకు మనవి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 70 దశాబ్దాలుగా ఆనెగొంది ప్రాంతంలో తమకు ఇళ్ళుస్థలాలు కేటాయించడం లేదని, ఎన్ని ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు మారినా తమ తలరాతలు మాత్రం మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో అధికారులు స్థలాలు కేటాయించక పోవడంతో డీమ్డ్ అటవీ ప్రాంతంలో తాత్కాలిక గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నట్లు వాపోయారు. ఈ విషయంపై గత ఏడాది జరిగిన శాసనసభ ఎన్నికలను బహిష్కరిస్తున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్ళామని, ఆ సందర్భంగా సర్వే జరిపి పట్టాలు పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు ఇంతవరకు తమవైపు తిరిగి చూడలేదని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించక పోతే ఈ ఎన్నికల్లో చిక్కరాంపుర, అంజినళ్ళి, జంగ్లి, హనుమనహళ్ళి, రంగాపుర గ్రామాలకు చెందిన తాము లోక్‌సభ ఎన్నికలను బహిష్కరించాలని నిర్ణయించామని తెలిపారు.



తాహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఐదు గ్రామాల ప్రజలు

లోక్‌సభ ఓటింగ్‌ను ప్రశాంతంగా జరపాలి / డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా

బళ్లారి సిటీ,ఏప్రిల్ 5: ఎన్నికల మార్గదర్శకాలను సరిగా తెలుసుకుని ఓటింగ్‌ను నీట్‌గా నిజాయితీగా పూర్తి చేయాలని, డిప్యూటీ కలెక్టర్ మహ్మద్ జుబేరా సీఆర్వో, పీఓ అధికారులకు సూచించారు. ఎలాంటి హడావుడి లేకుండా ప్రశాంతంగా పోలింగ్ గందరగోళాలను తొలగించాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో నగరంలోని కోటే ప్రాంతంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బళ్లారి అసెంబ్లీ నియోజకవర్గ పోలింగ్ అధికారులకు శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణ సమయంలో ఓటింగ్ యంత్రాన్ని ఎలా ఆపరేట్ చేయాలి, ఫారాలు ఎలా నింపాలి ఓటు వేసేముందు ఎలాంటి సన్నాహాలు చేసుకోవాలి, ఓటర్లతో ఎలా ప్రవర్తించాలి వంటి విషయాలను తెలుసుకోవాలన్నారు. ఎన్నికల విధుల పనితీరు, మస్టరింగ్ ప్రక్రియ సంబంధిత అంశాలపై పీఆర్‌ఓలు , ఏపీఆర్‌ఓలు, సిబ్బంది ఓటింగ్‌కు ముందు ఓటర్లు సమర్పించిన పత్రాలను పరిశీలించాలని సూచించారు. ఈసందర్భంగా మహానగర పాలక సంస్థ కమిషనర్ ఖలీల్‌సాబ్, పీఆర్‌ఓ, ఏపీఆర్‌ఓ, పీఓ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ అధికారులకు శిక్షణ ఇస్తున్న అదనపు జిల్లాకలెక్టర్ మహ్మద్‌జుబేరా

ఉగాదికి సిద్ధమైన నూతన రథం



కంప్లి, ఏప్రిల్ 5 : కంప్లి సమీపంలోని దేవలాపురం గ్రామంలో ఆంజనేయస్వామికి నూతన రథాన్ని సిద్ధం చేశారు. గతంలో చిన్నపాటి రథం వుండటంతో గ్రామస్తులే ముందుకొచ్చి రూ. 30లక్షలకు పైగా వ్యయం చేసి గదగ్ వద్ద నూతనరథాన్ని సిద్ధం చేసుకున్నారు. ఉగాది పాడ్యమి రోజున నూతనరథాన్ని ఊరేగించనున్నట్లు తెలిపారు. ఆ రోజు ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు జరుపుతారు. సాయంత్రం గ్రామంలో భారీఎత్తున భక్తాదుల మధ్య స్వామివారి రథాన్ని ఊరేగిస్తామని తెలిపారు.

పుస్తకాలు చదివే అలవాటు పెంచుకోవాలి



ఈదినగళమాతు ఈగేకే పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

బళ్లారి సిటీ,ఏప్రిల్ 5: విజ్ఞానాన్ని పెంపొందించడంలో పుస్తకాలు ముఖ్యపాత్ర పోషిస్తాయి. కావున ప్రతి ఒక్కరూ చదివే అలవాటును పెంపొందించేకోవాలని బెంగళూరు యూనివర్శిటీ కన్నడ అధ్యాపకులు, నాటక రచయిత ప్రొఫెసర్ రాజప్ప దళవాయి అన్నారు. విజయనగరం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అంబేద్కర్ ఆడిటోరియంలో కన్నడ, ఇంగ్లీషు, నాటక విభాగం సంయుక్తాధ్వర్యంలో శుక్రవారం శాంతనాయక్ రచించిన 'ఈదినగళమాతు ఈగేకే' పుస్తకాన్ని విడుదల చేసి వారు మాట్లాడారు. ఈరోజుల్లో పుస్తకాల చదివే అలవాటు తగ్గిపోవడం బాధాకరమని ప్రతి ఒక్కరూ చదివే అలవాటును పెంపొందించుకోవచ్చని తద్వారా విజ్ఞానం పెంపొందుతుందని సామాజిక వివక్ష తొలగిపోతుందన్నారు. బళ్లారికి చెందిన సాహితీవేత్త వి. ఆర్.వెంకటేష్ పుస్తకం గురించి మాట్లాడుతూ పుస్తక పఠనం వల్ల కలిగే ఇబ్బందులను సులభంగా అధిగమించవచ్చన్నారు. ఈసందర్భంగాకృష్ణదేవరాయ ఉపకులపతి రమేశ్ ఒలేకర్, కన్నడ విభాగాధిపతి రాబర్ట్‌జోషీ, శాంతనాయక్, నాటక విభాగాధిపతి అన్నాజీ కృష్ణారెడ్డి, వివిధ సంస్థల డీన్‌లు, లెక్చరర్లు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

వందలాది మంది బీజేపీలో చేరిక



వందలాది మంది అనుచరులతో బీజేపీలో చేరుతున్న సిద్ధప్ప

సిరుగుప్ప , ఏప్రిల్ 5 : టెక్కలకోట పట్టణ పంచాయతీ మాజీ అధ్యక్షుడు సిద్ధప్ప, వందలాది మంది కార్యకర్తలతో బీజేపీలో చేరారు. సిరుగుప్ప పట్టణం బీజేపీ కార్యాలయంలో శుక్రవారం తాలుకా అధ్యక్షులు కుంటనహాళ్ మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా సిద్ధప్ప మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పేద ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బడాబాబులను మాత్రం కాంగ్రెస్‌లో పట్టించుకుంటున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌ను వదిలి బీజేపీ పార్టీలో చేరుతున్నట్లు ఆయన తెలిపారు. బీజేపీలో చేరిన వారందరికీ తాలుకా అధ్యక్షులు, నాయకులు శాలువాలు, పూలమాలలు వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దొడ్డ ఉలిగప్ప, జైన్, వీరణ్ణగౌడ, సిద్ధప్ప, నటరాజు, ప్రధాన కార్యదర్శి బెళగల్ బసవరాజు, ఎస్‌ఎస్ నాగరాజ, పాల్గొన్నారు.

మారిన అంగన్‌వాడీ కేంద్రాల వేళలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 5: పెరుగుతున్న ఉష్ణోగ్రతల దృష్ట్యా ఏప్రిల్, మే నెలల్లో 8 జిల్లాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల సమయాలను తాత్కాలికంగా సవరించాలని ప్రభుత్వం ఆదేశించింది. కలబురగి, బళ్లారి, యాదగిరి, కొప్పళ, రాయచూర్, బీదర్,విజయపూర్, జిల్లాల్లో పనిచేస్తున్న అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు పనిచేయాల్సి ఉంటుంది.

కంప్లి మీదుగా గంగావతికి బస్సులు నడపకపోతే చర్యలు

కంప్లి, ఏప్రిల్ 5 : రాత్రివేళల్లో హోస్పేట నుంచి కంప్లి మీదుగా గంగావతికి బస్సులునడపకపోతే ఆ డ్రైవర్లకు నోటీసులు జారీ చేయాలని కేఆర్‌టీసీ డైరెక్టర్ ఎం రాచప్ప తెలిపారు. గురువారం ఆకస్మికంగా కంప్లి బస్టాండును తనిఖీ చేశారు. రాత్రివేళ 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు హోస్పేట నుంచి కంప్లి మీదుగా గంగావతికి వెళ్లే బస్సులు బుక్కసాగర, కడేబాగిలు నుంచి గంగావతి మీదుగా వెళుతున్నాయని స్థానికులు తెలిపారు. దీనిపై స్పందించిన ఆయన ఇకపై ఏ డిపోకు చెందిన బస్సు అయినా సరే రాత్రివేళల్లో హోస్పేట, కంప్లి, గంగావతి మీదుగానే రాకపోకలు జరపాలని లేకుంటే చర్యలు తప్పవన్నారు.

హోసూరు జోన్

వంద శాతం ఓటింగ్ నమోదుకు కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంచిపెడుతున్న అదియమాన్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు

హోసూరు(కృష్ణగిరి) ఏప్రిల్ 5 : డెంకణీకోట మున్సిపల్ డివిజన్ పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు రెవిన్యూ అధికారులు కరపత్రాలు పంచి అవగాహన కల్పించారు వేపనపల్లి ఏరియా, అళియానపల్లి గ్రామం, కృష్ణగిరి ఏరియా, కెలమంగలం ఏరియా, నాకలపట్టి తదితర ప్రాంతాల్లో వ్యవసాయ శాఖ అధికారులు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. అలాగేపార్లమెంట్ ఎన్నికలలో 100 శాతం ఓటింగ్ గురించి రెవిన్యూ అధికారులు ఉత్తంగరై అసెంబ్లీ నియోజకవర్గం, ఊత్తంగరై జిల్లా కలెక్టర్ కార్యాలయంల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఇరులర్ కాలనీ , సిగరలపల్లి ఏరియా లో వ్యాన్‌లో ఎన్నికల పాటలు మ్రోగిస్తూ ప్రచారం చేశారు. కరపత్రాల పంపిణీ చేయడమే కాకుండా, ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లు అతికించడం ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. హోసూరు డిప్యూటీ డైరెక్టర్ వ్యవసాయ కార్యాలయంలో ఓటింగ్ పై వ్యవసాయ శాఖ అధికారులు రంగోలీ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంల్లో కలెక్టర్ , హోసూరుల్లో వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు. శూలగిరి, అత్తిముగం, అదియమాన్ వ్యవసాయ కళశాలల విద్యార్థులు పార్లమెంట్ ఎన్నికలలో 100 శాతం ఓటింగ్ గురించి ప్రజల గృహాల వద్దకు , కిరాణ దుకాణాల వద్దకు, పార్కసీల వద్దకు వెళ్లి కరపత్రాలను పంచిపెట్టి వస్తున్నారు.

తనిఖీల్లో రూ.9 లక్షల స్వాధీనం

హోసూరు(క్రైం), ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీలలో రూ.9.38లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. వేర్వేరు చెక్‌పోస్టులలో స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించగా తగిన పత్రాలు లేకుండా కల్గిన నగదు, నగలు జప్తు చేశారు. బెంగళూరుకు చెందిన మంజునాథ్(46) కారులో రూ.2.10 లక్షల నగదును గుర్తించి ఎటువంటి రికార్డులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. అదే విధంగా మత్తిగిరి టైటాన్ టౌన్‌షిప్‌కు చెందిన బాలసుబ్రహ్మణి(33) తన కారులో రూ.52 వేలును తీసుకుని వెళ్తుండగా అధికారులు స్వాధీనం చేసుకున్నారు. డెంకణీకోటకు చెందిన వెంకటరాజ్(44) తన కారులో రూ లక్ష నగదు కల్గి ఉండడంపై తగిన పత్రాలు లేకపోవడంతో జప్తు చేశారు. కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని అత్తిబెలెకు చెందిన మునిరాజ్(26) తన కారులో రూ.4 లక్షలు ఉండడాన్ని గుర్తించారు. తగిన రికార్డులు లేకపోవడంతో ఆ డబ్బును స్వాధీనం చేసుకున్నారు. హోసూరు బాగలూరు బాలికల ఉన్నత పాఠశాల సమీపాన వాహన తనిఖీల సందర్భంగా కొత్తిమీర వ్యాపారి రాజప్ప (52) తన కారులో తీసుకెళుతున్న రూ.86,900 నగదుకు ఎటువంటి పత్రాలు లేకపోవడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. వివిధ చోట్లలో స్వాధీనం చేసుకున్న నగదును హోసూరు సబ్ కలెక్టర్ ప్రియాంకకు అప్పగించారు.

కరుమారియమ్మ ఆలయంలో హోమాలు

హోసూరు, ఏప్రిల్ 5: హోసూరులోని రాయకోట రోడ్డు భారతీయర్ నగర్ ప్రాంతంలో కొలువైన దేవి కరుమారియమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఉదయం 7.30 గంటలకు గణపతి హోమం, దుర్గా హోమం, నవగ్రహ హోమం, కలశాభిషేకం అమ్మవారికి నిర్వహించారు. వివిధ పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. హోసూరు మున్సిపల్ పబ్లిక్ హెల్త్ కమిటీ చైర్మెన్ మాదేశ్వరన్, పర్యవేక్షించారు.



హోమంలో పాల్గొన్న భక్తాదులు

నకిలీ కులధ్రువీకరణపై హైకోర్టుకు వెళతాం

- కుల సంఘాల నాయకుల హెచ్చరిక



విలేకరులతో మాట్లాడుతున్న నరసింహులు నాయక్ కరడిగుడ్డ

రాయచూరు, ఏప్రిల్ 5 : రాయచూరు లోకసభ సభ్యుడు రాజా అమరేశ్వర్ నాయక్ నకిలీ కుల ధ్రువీకరణ పత్రం సమర్పించడంపై హైకోర్టును ఆశ్రయిస్తామని నరసింహులు నాయక్ కరడిగుడ్డ తెలిపారు. కుల సంఘాల నాయకులతో కలిసి శుక్రవారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పాఠశాలలో నమోదైన పేరు ఆధారంగానే ప్రతి ఒక్కరికి కుల ధ్రువీకరణ లభిస్తుందని ఈ విషయంలో రాజా అమరేశ్వర్ నాయక్ పెద్ద ఎత్తున దుర్వినియోగానికి పాల్పడినట్లు ఆరోపించారు. స్కూల్ రిజిస్టర్‌లో క్షత్రియ నాయక్ అని, వాల్మీకి నాయక్ అని తెలిపిన వారు ఎస్టీలుగా ఎలా పరిగణింపబడతారని ప్రశ్నించారు. ఈ రెండు కులాలు ఎస్టీ ఉప జాతుల్లోనే లేవని స్పష్టం చేసిన ఆయన నకిలీ కుల సర్టిఫికెట్లపై తాము పోరాటం చేయనున్నట్లు తెలిపారు. అదే సమయంలో ఎంపీ రాజా అమరేశ్వర్ నాయక్ పట్ల తమకు ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదని ఆయన ఎన్నికల్లో పోటీ చేయకుండా అడ్డుకోవాలన్న లక్ష్యం తమకేమి లేదని స్పష్టంగా తెలిపారు. ఈ విషయంలో తమ కులానికి జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నించడమే తమ ప్రధాన ఉద్దేశమన్నారు. ఇప్పటివరకు ఈ విషయాలపై అవగాహన లేకపోవడం వల్లే ఎవ్వరు ప్రశ్నించ లేదని అందుకే తాము హైకోర్టుకె వెళతామన్నారు.

కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా వసంత్‌కుమార్!

- బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్

రాయచూరు, ఏప్రిల్ 5 : జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎ.వసంత్‌కుమార్‌కు రాష్ట్ర స్థాయి బాధ్యతలు లభించాయి. కేపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎంపికై నియమితులైన వసంత్‌కుమార్‌కు శుక్రవారం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ బాధ్యతలు అప్పగించారు.



వసంత్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న డీసీఎం

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాయ్...

రాఫెల్ (జయంతి, వర్ధంతి)



ఇటలీ దేశ ప్రఖ్యాత చిత్రకారుడు, శిల్పి రాఫెల్లో సాంజియో డా అర్బినో 1483 ఏప్రిల్ 6న జన్మించారు. ఇటలీ దేశ చిత్రకళలో తనదైన ముద్రను చాటారు. మిచెలాంజెలో, లియనార్డో డావిన్సివంటి ప్రముఖులతో కలసి గొప్పచిత్రాలు రూపొందించారు. ఆయన గీసిన చిత్రాలు వాటికన్ ప్యాలెస్‌లో ప్రదర్శించ బడ్డాయి. వాటికన్‌లోని 'ది స్కూల్ ఆఫ్ ఏథెన్స్', స్టాంజా డెల్లా సెగ్నేచురా వంటివి ప్రాచుర్యం పొందా యి. 37వ యేట 1520 ఏప్రిల్ 6న కన్నుమూశారు. ఇలా జయంతి, వర్ధంతి ఒకేరోజు రావడం విచిత్రం.

మీనాక్షి సుందరం పిళ్లై (జయంతి)




మీనాక్షి సుందరం పిళ్ళై 1815 ఏప్రిల్ 6న జన్మించారు. తమిళ సాహితీవేత్త. సాహిత్యంపై ఎనలేని పరిశోధనలు చేసి గుర్తింపు తెచ్చారు. ప్రత్యేకించి శైవ ఆగమంపై విశేష సేవలం దించారు. 90 స్థల పురాణాల గురించి, విభిన్న ఆలయాల గురించి రచనల ద్వారా వివరించారు. ఎంతోమంది శిష్యులకు సాహిత్యంపై అవగాహన కల్పించారు. 1876 ఫిబ్రవరి 1న కన్నుమూశారు.

సుచిత్రాసేన్ (జయంతి)



'పద్మశ్రీ' గ్రహీత సుచిత్రాసేన్ 1931 ఏప్రిల్ 6న బెంగాల్ ప్రెసిడెన్సీలోని పాబ్నా ప్రాంతంలో (ప్రస్తుతం బంగ్లాదేశ్) జన్మించారు. ఆమె అసలు పేరు రోమా దాస్ గుప్త. బెంగాలీ, హిందీ సినీ రంగంలో ఎంతో పేరొందారు. బెంగాల్‌లో 'మహానాయిక'గా గుర్తింపు పొందారు. పశ్చిమబెంగాల్ రాష్ట్రప్రభుత్వంచే 'బంగాబిభూషణ్' పురస్కారం అందుకున్నారు. 1955లో హిందీలో బిమల్‌రాయ్ రూపొందించిన 'దేవదాస్' సినిమాకు ఉత్తమ నటిగా నిలిచారు. అంతర్జాతీయ ఫిలిం ఫేర్ అందుకున్న తొలి భారతీయ నటి. మాస్కో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు 'సాత్ పాకే బంధ' ఎంపిక కావడంతో ఉత్తమనటిగా అంతర్జాతీయ స్థాయి లో గుర్తింపు పొందారు. 2014 జనవరి 17న కన్ను మూశారు. కాగా ఆమె కుమార్తె మున్ మున్ సేన్, మనుమరాళ్లు కూడా సినీరంగంలో ఉన్నారు.

దిలీప్ వెంగ్‌సర్కర్ (పుట్టినరోజు)



మాజీ క్రికెటర్ దిలీప్ బల్వంత్ వెంగ్‌సర్కర్ 1956 ఏప్రిల్ 6న మహారాష్ట్రలోని రాజాపూర్‌లో జన్మించారు. సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. 70, 80 దశకాలలో సునీల్ గవాస్కర్, గుండప్ప విశ్వనాథ్‌లతో కలసి ఆడారు. 'కల్నల్' అని ముద్దుగా పిలవబడ్డారు. బాంబేలో రంజీ ట్రోఫీలకు ప్రాతినిథ్యం వహించారు. టెస్టు మ్యాచులలో వరుసగా మూడుసార్లు సెంచరీలు చేసి గుర్తింపు పొందారు. బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా సుదీర్ఘ కాలం కొనసాగారు. పద్మశ్రీ, అర్జున పురస్కారాలు అందుకున్నారు. మూడు క్రికెట్ అకాడమీల ద్వారా ఎంపిక చేసిన క్రీడాకారులకు ప్రతిభ ఆధారంగా వివిధ దశలలో ఉచిత తర్ఫీదు ఇస్తున్నారు.

ఘనంగా నాగదేవత విగ్రహ ప్రతిష్ఠ



నాగదేవత విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

గోరంట్ల, ఏప్రిల్ 5: పట్టణంలోని బస్టాండ్ కూడలిలో నాగదేవత విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనాది నుంచి స్థానికులు నాగదేవతను గ్రామదేవతగా భావించి పూజలు చేసేవారు. కాలక్రమేణ రోడ్డు విస్తరణలతో బస్టాండ్ కూడలి పట్టణం మధ్యలోకి వచ్చేసింది. అయినా ఇక్కడి నాగదేవతను స్థానికులు భక్తితో ఆరాధించేవారు. అయితే ఇటీవల రాత్రి వేళ గుర్తుతెలియని వాహనాల పలుమార్లు ఢీకొనడంతో నాగదేవత కట్ట శిథిలావస్థకు చేరింది. దీంతో స్పందించిన స్థానికులు చందాలు సేకరించి రూ.50వేల వ్యయంతో రాతి దిమ్మెను, నూతన విగ్రహాన్ని ఆళ్లగడ్డ నుంచి తీసుకొచ్చారు. పురోహితులు భాస్కర్‌తారానాథ్‌శర్మ, మేఘనాథశర్మ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణలతో ప్రాణ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈ ప్రాంతానికి సుబ్రహ్మణేశ్వరస్వామి సర్కిల్‌గా నామకరణం చేశారు. పట్టణానికి చెందిన వెంకటరెడ్డి, మణికంఠ, ఆనంద్, బొలేరా శీనా, మురళి, శబరీష్, సుకుమార్, పలువురు ఉపాధ్యాయులు సహాయ, సహకారాలు అందించారు.

నకిలీ అధికారులొచ్చారు..!

- ముదిగుబ్బలో హల్‌చల్.. ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ తనిఖీలు.. తినుబండారాల దుకాణం నుంచి డబ్బు వసూలు..

ముదిగుబ్బ, ఏప్రిల్ 5: మండల కేంద్రంలో నకిలీ అధికారులు హల్‌చల్ చేసిన విషయం శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఫుడ్ సేఫ్టీ అధికారులమంటూ టోకరా వేసి, దుండగులు డబ్బు దండుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. స్థానిక అనంతపురం రోడ్డులో తినుబండారాల వ్యాపారం చేసుకునే ప్రవీణ్‌కుమార్ వద్దకు గురువారం మధ్యాహ్నం ముగ్గురు వ్యక్తులు కారులో వచ్చారు. తాము ఫుడ్‌సేఫ్టీ అధికారులమనీ, తనిఖీలకు వచ్చామని షాపు యజమానిని నమ్మించారు. గడువు ముగిసిన సరుకు అమ్ముతున్నావంటూ బెదిరించారు. రూ.25 వేలు జరిమానా వేస్తున్నామన్నారు. కేసు లేకుండా వదిలేస్తామని చెప్పి రూ.12 వేలు తీసుకుని, కారులో వెళ్లిపోయారు. కొద్దిసేపటికి అనుమానం వచ్చిన ప్రవీణ్‌కుమార్ జిల్లా ఫుడ్ ఇన్స్‌పెక్టర్ రామచంద్రకు ఫోన్ చేసి, ఆరాతీశారు. తమ డిపార్ట్‌మెంట్ తరఫున ఎవరూ తనిఖీలకు రాలేదనీ, ఎవరో దుండగులు వచ్చి ఉంటారని ఆయన చెప్పారు. మోసపోయానని తెలుసుకున్న షాపు యజమాని ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ముదిగుబ్బ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ యతీంద్ర కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు. అందులో భాగంగా కొందరు అనుమానితులను అదుపులోకి తీసుకుని, విచారిస్తున్నట్లు తెలిసింది.

ప్రముఖులను ఢీ కొట్టేందుకు అవే పేర్లతో నామినేషన్లు

- బెంగళూరు గ్రామీణలో ఐదుగురు మంజునాథ్‌లు, ముగ్గురు సురేశ్‌లు
- చిక్కబళ్లాపురలో మరో ఇద్దరు సుధాకర్‌లు

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేడి రాజుకుంది. తొలి విడతలో 14 నియోజకవర్గాలకు నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థుల మధ్యనే పోటీ ఉంది. మరో శక్తివంతమైన రాజకీయ పార్టీ లేదు. అయితే ప్రధాన పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులకు కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది. అభ్యర్థుల పేర్లకు పోలిక ఉండేలాంటి పేర్లతోనే పలువురు నామినేషన్లు వేశారు. రాష్ట్రంలో అత్యంత క్రియాశీలకమైన నియోజకవర్గమైన బెంగళూరు గ్రామీణలో



డాక్టర్ సీఎన్ మంజునాథ్, డాక్టర్ కె. సుధాకర్, డీకే సురేశ్

కాంగ్రెస్ అభ్యర్థిగా డీకే సురేశ్, బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థిగా డాక్టర్ సీఎన్ మంజునాథ్ పోటీ చేస్తున్నారు. ఇదే స్థానం నుంచి ఐదుగురు మంజునాథ్‌లు, ముగ్గురు సురేశ్‌లు పోటీలో ఉన్నారు. వీరిలో సీ మంజునాథ్, ఎన్ మంజునాథ్, మంజునాథ్ కే, సీఎన్ మంజునాథ్ వంటి పేర్లు కల్గిన అభ్యర్థులు ఉన్నారు. ఇక ఎస్ సురేశ్, ఎంన్ సురేశ్ లుపోటీలో ఉన్నారు. ఇది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాలేదు. చిక్కబళ్ళాపురలో కాంగ్రెస్ అభ్యర్థి రక్షా రామయ్యపై బీజేపీ-జేడీఎస్ ఉమ్మడి అభ్యర్థి మాజీ మంత్రి డాక్టర్ కే సుధాకర్ పోటీలో ఉన్నారు. ఇక్కడ డీ సుధాకర్, కే సుధాకర్ అనే మరో ఇద్దరు పోటీలో ఉన్నారు. ఉడుపి-చిక్కమగళూరు నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా కోట శ్రీనివాసపూజారి బరిలో ఉన్నారు. సురేశ్ పూజారి, సుప్రీత్ పూజారి అనే ఇద్దరు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇక తుమకూరు కాంగ్రెస్ అభ్యర్థి ముద్ద హనుమేగౌడ బరిలో ఉండగా ఇక్కడ హనుమయ్య అనే వ్యక్తి బరిలో ఉన్నారు. బెంగళూరు ఉత్తరలో కేంద్రమంత్రి శోభాకరంద్లాజె అభ్యర్థి కాగా శోభ, శోభన్‌బాబు అనే ఇద్దరు అభ్యర్థులు కూడా పోటీ చేస్తున్నారు. ఇక బెంగళూరు సెంట్రల్ కాంగ్రెస్ అభ్యర్థి మన్సూర్ అలిఖాన్ కాగా ఇదే ని యోజకవర్గం నుంచి ముక్తార్ అలిఖాన్ ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నాడు. మైసూరు నుంచి బీజేపీ-జేడీఎస్‌ల ఉమ్మ డి అభ్యర్థిగా యదువీర్ బరిలో ఉండగా, యదూరప్ప అనే వ్యక్తి ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నాడు. జేడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు హెచ్‌డీ కుమారస్వామి పోటీ చేస్తున్న మండ్యతోపాటు జేడీఎస్ కీలక నేత హెచ్‌డీ రేవణ్ణ కుమారుడు ప్రజ్వల్ రేవణ్ణ హాసన్‌లో పోటీలో ఉన్నాడు. రెండు స్థానాల్లోనూ హెచ్‌డీ రేవణ్ణ అనే వ్యక్తి పోటీ చేస్తున్నారు. ఇలా పోలికలు ఉన్న పేర్లతో అభ్యర్థులు పోటీ చేయడంతో సర్వత్రా గందరగోళం అనిపిస్తోంది.

ఓటు హక్కుపై వినూత్న చైతన్యం

బంగారపేట, ఏప్రిల్ 5: ప్రజాప్రభుత్వ పండుగ అయిన సార్వత్రి ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని పురసభ ముఖ్య అధికారి మీనాక్షి పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల పీయూ కళాశాల ఆవరణలో పురసభ ఆధ్వర్యంలో ఓటుహక్కుపై జాగృతిలో భాగంగా రంగవల్లులు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో కులమతల వర్గాలకు అతీతంగా అందరూ భాగస్వామ్యులయ్యేలా ఓట్ల పండుగ జరుగుతుందని, ఇందులో ఓటర్లంతా క్రియాశీలకంగా పాల్గొని ఓటు వేయాలన్నారు. నా ఓటు నా హక్కు, ఓట్ ఫర్ ఇండియా అనే నినాదాలు రాసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

వధూవరులు, కుటుంబీకులతో ప్రతిజ్ఞ

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వందశాతం ఓటింగ్ లక్ష్యం సాధించేలా ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం, జిల్లా స్వీప్ సమితిలు కార్యాచరణ చేపట్టాయి. చిక్కబళ్ళాపుర జిల్లా చింతామణిలో టీటీడీ కల్యాణమండపంలో గురువారం రాత్రి పెళ్లి రిసెప్షన్‌లో తాలూకా స్వీప్ సమితి ఆధ్వర్యంలో ఓటు హక్కుపై జాగృతి నిర్వహించారు. వధూవరులు నవీన్ కుమార్, అనుషాలకు ప్లకార్డులు ఇచ్చారు. వధూవరులు సహా కార్యక్రమంలో పాల్గొన్నవారితో ఓటు హక్కుపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా తాలూకా పంచాయతీ ఈఓ ఎస్ ఆనంద్ మాట్లాడుతూ ప్రజలు గుమిగూడేచోట్ల వారిలో చైతన్యం కల్పించేలా స్వీప్ సమితి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సహకరించిన వధూవరుల కుటుంబాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నగరసభ కమిషనర్ మాధవి, సాంఘిక సంక్షేమ అధికారి శ్రీనివాసనాయక్, తాలూకా పంచాయతీ నోడల్ అధికారి వెంకటేశ్, నగరసభ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓటు చైతన్యంలో పాల్గొన్న మహిళలు తదితరులు

ఓటింగ్‌పై ఎడ్లబండ్లతో జాతా

బాగేపల్లి, ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటింగ్‌శాతం పెంచే లక్ష్యంగా తాలూకా స్వీప్‌సమితి, తాలూకా యంత్రాంగం ఆధ్వర్యంలో ఎడ్లబండిపై జాథా నిర్వహించి జాగృతి కల్పిం చారు. శుక్రవారం ఏర్పాటైన జాథాను ఎన్నికల సహాయక అధికారి సంతోష్‌కుమార్ ప్రారంభించి మాట్లాడుతూ ఈనెల 26న పోలింగ్‌లో ఓటర్లంతా పాల్గొని తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. తహసీల్దారు ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ ప్రజాప్రభుత్వంలో ఎవరూ తమ ఓటు హక్కును నిర్లక్ష్యం చేయకుండా వినియోగించు కోవాలన్నారు. ఎడ్లబండిని పుష్పాలు, ఆకుపచ్చటి తోరణాలు, రంగురంగుల బెలూన్లతో సింగారించారు. 25కుపైగా ఎడ్లబండ్లు జాతాలో పాల్గొన్నాయి. ఓటు వేసిన వ్యక్తి హీరో, మీ ఓటు - మీ భవిష్యత్తు, ప్రజల శక్తి ఓటు హక్కు, ఓటు వేసినవారే శూరుడు అనే నినాదాలను ప్రదర్శించారు. డీవీజీ రోడ్డు ఇతర మార్గాల్లో జాతా సాగింది. ఈ సందర్భంగా స్త్రీ శిశుసంక్షేమశాఖ అధికారులు కేవీ రామచంద్ర, ఈఓ హేమావతి, సీఐ ప్రశాంత్ వర్ధి, గుడిబండ తహసీల్దారు మణిషా, 28 గ్రామపంచాయతీల పీడీఓలు పాల్గొన్నారు.



ఓటుహక్కు ప్లకార్డులతో వధూవరులు



జాతాలో ఎడ్లబండ్లు

సరళంగా బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి

బాగేపల్లి, ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పట్టణంలో సరళంగా, సాంకేతికంగా నిర్వహించారు. తాలూకా పంచాయతీ, జిల్లా పంచాయతీ, సాంఘిక సంక్షేమశాఖ, పురసభ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహిం చారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తహసీల్దార్ ప్రశాంత్ కే పాటిల్ మాట్లాడుతూ బాబుజీగా పేరొందిన స్వాతంత్ర్య పోరాటనేత, రాజకీయ నేతగా జగ్జీవన్‌రామ్ సత్తా చాటుకున్నారన్నారు. తొలి ఉపప్రధానిగా ఉత్తమ సేవలందించారన్నారు. దళిత నాయకుడు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ పేదలు, దళితుల సంక్షేమానికి బాబుజీ ఎంతో కృషి చేశారన్నారు. ఇదే సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్నవారిచే ఓటు హక్కుపై చైతన్యం కల్పిస్తూ ప్రతిజ్ఞ చేయిం చారు. ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్ హనుమంతరెడ్డి, తాలూకా పశువైద్యుడు కృష్ణమూర్తి, పరి శ్రమలశాఖ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బంగారపేటలో...

బంగారపేట, ఏప్రిల్ 5: సమాజంలో వెనుకబడిన వర్గాల ఉన్నత కోసం మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని కర్ణాటక దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంచాలకులు సూలికుంటె రమేశ్ అభిప్రాయపడ్డారు. పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం బాబు జగజ్జీవన్‌రామ్ 117వ జయంతి సంద ర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రమేశ్ మాట్లాడుతూ ఆహార ఉత్పత్తుల దిగుబడి పెంచడంలో ఇతోధికంగా కృషి హరిత విప్లవానికి నాంది పలికారన్నారు. రక్షణశాఖ మంత్రిగా, వ్యవసాయ మంత్రిగా బాబుజీ సేవలు చిరస్మరణీయమన్నారు. ఆయన జీవిత చరిత్ర నేటి యువతకు తెలిసేలా కృషి చేయాల్సి ఉందన్నారు. కాగా ఇటీవల రాజ్యాంగ సవరణ గురించి బీజేపీ ఎంపీ అనంతకుమార్ హెగ్డే చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా సంచాలకుడు ఎస్‌డీ మునిస్వామి, పదాధికారులు నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.



విజయపుర పురసభ కార్యాలయంలో...

ఆదర్శప్రాయుడు జగ్జీవన్‌రామ్

విజయపుర, ఏప్రిల్ 5: దేశ స్వాతంత్ర్యపోరాటనేతగానే కాక మాజీ ఉపప్రధానిగా బాబూ జగజ్జీవన్‌రామ్ అందించిన సేవలు ఆదర్శప్రాయమని పురసభ ముఖ్య అధికారి సంతోష్‌కుమార్ అభిప్రాయపడ్డారు. దేవనహళ్ళి తాలూకా విజయపుర పట్టణంలో శుక్రవారం పురసభ ఆవరణలో ఏర్పాటైన జయంతిలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో వెనుకబడినవర్గాలు, కార్మికుల సంక్షేమానికి నిరంతరం పాటుపడ్డారన్నారు. పురసభ అధికారి లింగణ్ణ, సిబ్బంది శివనాగేగౌడ, హేమవతి, అప్పి, వినోద్, పురసభ పౌరకార్మికులు పాల్గొన్నారు.



బాగేపల్లి తాలూకా పంచాయతీ కార్యాలయంలో..



అంబేడ్కర్ భవనంలో బాబు జగ్జీవన్‌రామ్‌కు నివాళులు

విద్యార్థుల్లో ఆలోచన రేకెత్తించే బోధన చేయాలి

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులలో కొత్త ఆలోచనలు రేకెత్తించేలాంటి బోధనలు ముఖ్యమని ఏఎంసీ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ కేఆర్ పరమహంస అభిప్రాయపడ్డారు. ఏఎంసీ ఇంజనీరింగ్ కళాశాలలో స్టూడెంట్ ఇన్నోవేటర్‌లు, పాఠశాలల ప్రిన్సిపాళ్ల కోసం ఇన్నోవేషన్స్ ఫర్ డిజైన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే అంశంపై రెండు రోజుల బూట్‌క్యాంప్ జరిగింది. ఏఐసీటీఈ, సీబీఎస్‌ఈ, ఎన్‌సీఈఆర్‌టీలు సంయుక్తంగా ఇన్నోవేషన్ సెల్, విద్యామంత్రిత్వశాఖలు పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగంపై పలువురు వక్తలు మాట్లాడారు. చైర్మన్ డాక్టర్ పరమహంస మాట్లాడుతూ యువ విద్యార్థులలో వ్యూహాత్మ కమైన ప్రణాళికలు అమలు చేసేందుకు ఇటువంటి సదస్సులు స్ఫూర్తినిస్తాయన్నారు. ఏఎంసీ సంస్థల ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కల్లూరి మాట్లాడుతూ విద్యా మంత్రిత్వశాఖ ఇటువంటి వినూత్న కార్యక్రమాలకు ఏఎంసీ సంస్థలను భాగస్వామ్యం చేయడం సంతోషంగా ఉందన్నారు. గత ఏడాది ఆగస్టులో ఏఐసీటీఈతో కలసి కవచ్, హ్యాక థాన్ ప్రోగ్రామ్ నిర్వహించామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కే కుమార్ రెండు రోజుల ప్రణా ళికను వివరించారు. విద్యార్థులతోపాటు ఉపాధ్యాయులు, హెడ్మాస్టర్‌లు తదితరులు 300మంది శిక్షణలో పాల్గొన్నారు.



వేదికపై ప్రముఖులు

అశ్విని పునీత్‌పై అనుచిత పోస్టింగ్

- అభిమానుల ఆగ్రహం

బెంగళూరు, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు ఇటీవల నాలుగు పోటీలకుగాను మూడు మ్యాచ్‌లు ఓడి కేవలం ఒక మ్యాచ్ మాత్రమే గెలిచింది. ఆర్‌సీబీ అన్‌బాక్సింగ్ ఈవెంట్‌కు నిర్మాత అశ్విని పునీత్ రాజ్‌కుమార్ కూడా హాజరయ్యారు. ఈమె కారణంగానే ఆర్‌సీబీ ఓడిందంటూ సోషల్‌మీడియాలో చేసిన పోస్టు అభిమానుల్లో ఆగ్రహానికి కారణమైంది. గజపడె6 పేరిట ఎక్స్‌లో ఒకరు 'శుభ కార్యాలకు భర్త చనిపోయిన మహిళలను పిలవరాదంటూ' పోస్టింగ్ చేశారు. పోస్టుకు సంబంధించి పునీత్ రాజ్‌కుమార్, దర్శన్ పేర్లను హ్యాష్‌ట్యాగ్ చేశారు. శుక్రవారం ఇందుకు సంబంధించిపోస్టు వైరల్ అయ్యింది. ఇందుకు సంబంధించి నటుడు దర్శన్ అభిమానుల సంఘం ప్రధాన కార్యదర్శి పునీత్ స్పందిస్తూ ఇది కొంతమంది దురభిమానులు చేసిన పోస్టింగ్ అన్నారు. ఈ విషయాన్ని నటుడు దర్శన్ దృష్టికి తెచ్చామని ఆయన కూడా విచారం వ్యక్తం చేశారన్నారు. ఎవరు ఏం చెప్పినా సోషల్‌మీడియా ద్వారా సమాధానం ఇవ్వరాదని ఇప్పటికే దర్శన్ తమకు సూచించారన్నారు. కాగా ఈ అంశంపై ఫిర్యాదు చేసే ఆలోచనలో పునీత్ అభిమానులు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పోస్టింగ్‌లు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఇదిలా ఉండగా సోషల్‌మీడియాలో ఒకరి మనోభావాలను దెబ్బతీసేలా ఇష్టం వచ్చినట్టు పోస్టింగ్‌లు చేసేవారిపై నియంత్రణ చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు అభిమానులు డిమాండ్ చేస్తున్నారు.

మల్లేశ్‌బాబును గెలిపించి సీఎంకు బదులివ్వండి

శిడ్లఘట్ట, ఏప్రిల్ 5: జేడీఎస్ ఎక్కడ ఉందని తరచుగా వ్యాఖ్యానించే సీఎం సిద్దరామయ్య ప్రశ్నకు బదులుగా కోలారు బీజేపీ-జేడీఎస్ మైత్రి అభ్యర్థి మల్లేశ్‌బాబును గెలిపించడం ద్వారా సమాధానమివ్వాలని ఎమ్మెల్యే బీఎన్ రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంలోని బస్టాండ్ వద్ద అంజనాద్రి భవన్‌లో ఏర్పాటైన బీజేపీ, జేడీఎస్ కార్యకర్తలసమన్వయ సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోదీ ప్రధాని కాక మునుపు అభివృద్ధి దేశాలలో భారత్ పదో స్థానంలో ఉండేదని ఇప్పుడు నాల్గో స్థానానికి చేరిందన్నారు. మోదీని మరోసారి ప్రధాని చేస్తే దేశాన్ని మూడోస్థానానికి చేరుస్తారనడంలో అనుమానం లేదన్నారు. ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్-బీజేపీ మైత్రి అభ్యర్థి మల్లేశ్‌బాబును గెలిపించేందుకు కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయాలన్నారు. నియోజకవర్గ బీజేపీ నాయకుడు సీకల్ రామచంద్రగౌడ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం జేడీఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకున్నారన్నారు. కోలారు నియోజకవర్గంలో జేడీఎస్ బలంగా ఉందని ఇటీవలి కాలంలో బీజేపీ కూడా ఆదరణ పొందిందన్నారు. మనందరి ఉద్దేశ్యం మోదీని మళ్లీ ప్రధాని చేయడమేనని ఈ దిశగా కార్యకర్తలు బూత్‌స్థాయినుంచి కృషి చేయాలన్నారు. సమావేశంలో కోలారు ఎంపీ ఎస్ మునిస్వామి, ఎమ్మెల్సీ ఇంచర గోవిందరాజు, ఎంపీ అభ్యర్థి మల్లేశ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే ఎం రాజణ్ణ, చిక్కబళ్ళాపుర జిల్లా బీజేపీ అధ్యక్షుడు రామలింగప్ప, సీకల్ ఆనందగౌడ తదితరులు పాల్గొన్నారు.

గ్యారెంటీ పథకాలతో భయపడుతున్న బీజేపీ



ప్రసంగిస్తున్న మాజీ మేయర్ మంజునాథ్

బొమ్మనహళ్ళి, ఏప్రిల్ 5: రాష్ట్రంలో సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారెంటీ పథకాలకు ప్రజలనుంచి లభిస్తున్న ఆదరణను చూసి భయపడి బీజేపీ అబద్ధాలను ప్రచారం చేస్తోందని మాజీ మేయర్ మంజునాథ్ మండిపడ్డారు. మంగమ్మనపాళ్యలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బెంగళూరు దక్షిణ సిట్టింగ్ ఎంపీ తేజస్వి సూర్య కొంతకాలంగా ప్రజలకు అందుబాటులో లేరని ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఆయన తిరుగుతున్నారన్నారు. ఎంపీ ఫండ్స్ నుంచి నియోజకవర్గానికి చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణ ఓర్వలేక అబద్ధాలు చెబుతున్నారన్నారు. బెంగళూరు దక్షిణ కాంగ్రెస్ అభ్యర్థి సౌమ్యరెడ్డి విజయానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎమ్మెల్సీ నారాయణస్వామి, గ్యారెంటీ పథకాల సమితి రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణప్ప, ఉమాపతిగౌడ, హెచ్‌ఎస్‌ఆర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసుదేవరెడ్డి, కేపీసీసీ సభ్యుడు బాలకృష్ణారెడ్డి, ప్రచార సమితి సభ్యుడు వాసుదేవరెడ్డి, రాఘవేంద్ర, జగదీశ్, అనిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.4లక్షల నగదు స్వాధీనం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 5: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తమిళనాడు సరిహద్దులో ఉన్న కగ్గనూరు చెక్‌పోస్ట్ వద్ద బాగలూరు పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. చెక్‌పోస్ట్ అధికారి వెంకటేశ్ నేతృత్వంలో వాహనాల సోదాల వేళ రూ.4లక్షల నగదును గుర్తించారు. ఎటువంటి రికార్డులు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ అమీర్ బాషా, శివరాజు, అభిన్‌కుమార్, సీఆర్‌పీ అధికారులు రాజేంద్రరామ్ తదితరులు కార్యాచరణలో పాల్గొన్నారు.



సరిహద్దులో సోదాలు చేస్తున్న పోలీసులు